క్లుప్తంగా

వృద్ధునికి ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన గుడిపూడి దావీదు అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రకటించిన రూ.10వేలు మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ సోమవారం వృద్ధుడికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, సర్పంచ్ ఉన్నం ఝాన్సీ, సచివాలయ కన్వీనర్ సాంబశివరావు, బుజ్జి, సుద్దపల్లి కోటేశ్వరరావు, శేషయ్య, దురు ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముక్కోటి ఏర్పాట్లపై సమావేశం

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి ముక్కోటి ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీన జరగనున్న ముక్కోటి రోజు స్వామి వారి దర్శనానికి తరలిరానున్న భక్తులకు ఏర్పాట్లపై నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

9న జిల్లాస్థాయి బైబిల్ క్విజ్ పోటీలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో ఈనెల 9న జిల్లా స్థాయి బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ పి.దాసు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బైబిల్‌లోని న్యాయాధిపతులు, లూకా సువార్త, 2వ కొరింథీయుల పత్రికలో క్విజ్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు మంగళవారం లోగా తమపేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రతి గ్రూపునకు ముగ్గురు సభ్యులు ఉండాలని, వయస్సు పరిమితి లేదన్నారు. విజయం సాధించిన వారికి నగదు బహుమతి అందజేస్తారన్నారు. వివరాలకు 8919762979లో సంప్రదించాలనికోరారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



మంగళగిరి: క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ప్రొఫెసర్ పి ఉమామహేశ్వరి అన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కల నిర్మల ఫార్మసీ కళాశాలలో సోమవారం ఫార్మా-డి తరగతులు ప్రారంభమయ్యాయి. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో విలువైనది అని అన్నారు. విద్యార్థులు, యువత తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని అందుకోసం వారు చేయవలసినది వారి గమ్యాలను ఎంపిక చేసుకుని పట్టుదలతో, క్రమశిక్షణతో సాగాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ డాక్టర్ యు శౌరీలు, సెక్రటరీ జి నిర్మలజ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ పాములరెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం తగ్గేవరకు రైతులు తాము పండించిన పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఆత్మకూరు శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొలాలలో నీరు నిలబడకుండా డ్రెయినేజీ వ్యవస్థ ద్వారా నీటిని బయటకు పంపి పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, అదేవిధంగా పడిపోయిన వరి పొలాలలో విత్తనాలు మొలకలు రాకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని, వరి పంట కోత కోసి బయటకు వచ్చిన ధాన్యాన్ని తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా శివునికి అభిషేకాలు

పాతగుంటూరు: కార్తిక మాసం సందర్భంగా సోమవారం నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈశ్వరుని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. ప్రధానంగా కొత్తపేటలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు దండిభోట్ల వేణుగోపాల్ నిర్వహణలో స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ మొగిలి సతీష్ కుమార్, ఈవో శివారెడ్డి పర్యవేక్షించారు. పాత గుంటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, శ్రీ అంకమ్మ తల్లి ఆలయం, బ్రాడీపేటలోని శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం, కొరిటెపాడు, అరండల్‌పేట శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్



కృష్ణానది వద్ద వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి

- మంగళగిరి తహసీల్దార్ రామ్‌ప్రసాద్
- తుపాను నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- కంట్రోల్ రూం ఏర్పాటు

మంగళగిరి: తుఫాన్ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ ప్రభావంపై రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వలన ఎలాంటి ఇబ్బంది పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. భారీ వర్షాల కారణంగా వరదలతో ఏవైనా లోతట్టు ప్రాంతాలు జలమయమైతే వెంటనే అక్కడున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే గుర్తించిన లోతట్టు ప్రాంతాలలో ప్రజలకు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో రైల్వే ట్రాక్ ఉన్న ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వరద నీరు వస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్(9492728625) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులకు సిబ్బందికి ప్రస్తుతం ఎలాంటి సెలవులు మంజూరు చేసేది లేదన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సెక్రటరీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం తాడేపల్లి మండల, పట్టణ పరిధిలో తీవ్రంగా ఉంటుందని తుఫాన్ తీరం దాటేవరకు ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది అందుబాటులో ఉండాలని తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావం వలన తీవ్రమైన గాలులు, వర్షం పడనున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలని అన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో నివాసముండే వారు పశువులను కృష్ణానదిలో పంపవద్దని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే అధికారులకు లేదా కంట్రోల్ రూమ్‌కు సమాచారాన్ని అందజేయాలని, అధికారులు పరిస్థితులను ఎప్పటికప్పుడు కంట్రోల్‌రూమ్‌కు సమాచారాన్ని అందించాలని, అధికారులు సిబ్బంది తప్పని సరిగా అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలోని కృష్ణానది తీరంలో ఉన్న మత్స్యకారులు, ఇతరులు కృష్ణానదిలోకి వెళ్లవద్దు అంటూ తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నాగిరెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో కృష్ణానది సుమారు 10కిలోమీటర్ల మేర ఉందని పలు ప్రాంతాల్లో బీచ్‌లోకి దిగడానికి అనువుగా ఉందని సుమారు 300 కుటుంబాల మత్స్యకారులు కృష్ణానదిలోకి వేటకు వెళ్తున్నారని, వారితో పాటు పశువుల కాపరులు కూడా వెళ్తున్నారని వారు ఎవరు కూడా తదుపరి చర్యలు జారీ చేసే వరకు కృష్ణానదిలోకి దిగవద్దని సూచించారు. ఆయా ప్రాంతంలోని రెవెన్యూ సిబ్బంది సైతం ఎప్పటికప్పుడు కృష్ణానది పరిసర ప్రాంతాలను గమనిస్తూ ఉండాలని ఆయన సూచించారు. కృష్ణానది తీరంలో 15 చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వంశీతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులూ.. బీ కేర్ ఫుల్ !

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: మిచాంగ్ తుఫాన్ తీవ్రత వల్ల నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా ప్రాణ నష్టం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పీకలవాగు చుట్టుపక్కల, పురాతన భవనాల్లో నివాసం ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె సోమవారం జాతీయ రహదారి, పాత గుంటూరు, వేలాంగిణి నగర్, ఏటుకూరు రోడ్డు, బుడంపాడు రోడ్డు, బాలాజీ నగర్, నల్లచెరువు తదితర లోతట్టు ప్రాంతాల్ని, అవుట్ ఫాల్ డ్రైన్లను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ తుపాను తీవ్రత పెరుగుతున్న రీత్యా నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగర పరిధిలో ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా గతంలో జరిగిన ప్రాణ నష్టం పునరావృతం కాకుండా, పీకలవాగు చుట్టుపక్కల నివాసితులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని హితవు పలికారు. పురాతన భవనాల్లో నివాసం ఉండేవారు కూడా వర్షాలు పెరిగితే గోడలు నాని కూలిపోయే అవకాశం ఉందని, తుఫాన్ తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగరంలో డబల్ సెల్లార్‌తో నిర్మాణంలో ఉన్న భారీ భవనాల యజమానులు, పరిసర ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం (0863-2345103)కి కాల్ చేయవచ్చని చెప్పారు. ఉన్నతాధికారులతో తుఫాన్ పర్యవేక్షణకు నాలుగు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ముందుగా క్షేత్రస్థాయి పర్యటనలో పలు ప్రాంతాల్లోని అవుట్ ఫాల్ డ్రెయిన్లలో మురుగుపారుదలకు పూడిక, వ్యర్థాల అడ్డంకి గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థా తొలగించాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్యాధికారుల్ని ఆదేశించారు. తొలగించిన పూడికతీత పనుల వివరాల్ని అందించాలని ఈఈలకు చెప్పారు. వర్షాలకు డ్రెయిన్ల కల్వర్ట్‌ల వద్ద అడ్డంకులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజారోగ్యాధికారులకు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో ఎక్కడైనా చెట్ల కొమ్మలు విరిగితే వాటిని వెంటనే తొలగించడానికి పార్క్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌కి చెప్పారు. తాగునీరు సరఫరా జరిగే రిజర్వాయర్లలో విద్యుత్ అంతరాయం కలిగిన సమస్యలు లేకుండా ముందస్తుగా జనరేటర్లని సిద్ధం చేసుకోవాలని ఏఈలను ఆదేశించారు. సచివాలయాల వారీగా కార్యదర్శులు, అధికారులు అందుబాటులో ఉండాలని, వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్గించాలని ఆదేశించారు.

బీఆర్ఎస్ ఓటమి స్వయంకృతాపరాధం

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

లక్ష్మీపురం: తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి స్వయంకృతాపరాధమేనని ఎమ్మెల్సీ కె.యస్ లక్ష్మణరావు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ వైఖరి, సిట్టింగ్ ఎమ్మెల్యేలని మార్చకపోవడం, నిరుద్యోగుల దెబ్బ, అతి విశ్వాసం తదితరాల వల్ల ఆ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలతో దగ్గరగా మెలగక పోవడం ఆయనపై వ్యతిరేకత పెంచిందని తెలిపారు. దీంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారశైలి తీవ్ర అసంతృప్తిని పెంచిదని చెప్పారు. రైతు బంధుతో గ్రామాల్లో వ్యవసాయం చేయని భూస్వాములకే ఉపయోగం జరిగిందని, కౌలు రైతులు తమ ఓటు ద్వారా నిరసన తెలియజేశారని తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో జాప్యం, పరీక్ష పత్రాల లీకేజీ, గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దు కావడం లాంటి వాటితో యువత తీవ్ర నిరసనను ఓటు ద్వారా తెలియజేశారని వివరించారు. జీతాలు, బిల్లులు చెల్లింపుల్లో జాప్యంతో ఉద్యోగులు వ్యతిరేకించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, రేవంత్‌రెడ్డి చాకచక్యంతో అందరినీ కలుపుకుపోవడం కాంగ్రెస్ విజయానికి దోహదపడిందని వెల్లడించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ మిగతా మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఏకపక్ష ధోరణి, అస్తవ్యస్త విధానాలు ఆ పార్టీ ఓటమికి కారణాలుగా చెప్పుకోవచ్చని తెలిపారు. పలువురు సంస్థ సీనియర్ సభ్యులు, విశ్లేషకులు, మేధావులు తదితరులు చర్చలో పాల్గొని వారి అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు.

ప్రాథమిక అంశాలపై పట్టుతోనే సంస్థలో పురోగతి



మాట్లాడుతున్న బట్టు నాగరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: సబ్జెక్ట్‌పై ప్రాథమిక అంశాలపై పట్టుతోనే కార్పొరేట్ సంస్థలో పురోగతి సాధ్యమని ఏఎన్‌యూ వాణిజ్యశాస్త్ర విభాగ డీన్ బట్టు నాగరాజు తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం ఎంబీఏ విద్యార్థులకు కార్పొరేట్ రంగంలో నైపుణ్యాలపై అతిథి ఉపన్యాసమిచ్చారు. కార్పొరేట్ రంగంలోకి ప్రవేశించే విద్యార్థులు విజ్ఞానానికి సంబంధించిన ప్రాథమిక అంశాలపై పట్టు కలిగి ఉండాలని సూచించారు. సంస్థ సంస్కృతి, సంప్రదాయాలకు అలవాటుపడి సత్సంబంధాల్ని నెరపాలని తెలిపారు. ఏ ప్రదేశంలో ఉద్యోగం వచ్చినా అక్కడ చేరే దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తద్వారా విజ్ఞానాన్ని, విశ్వాసాన్ని పెంచుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు ప్రధానంగా పాఠ్యాంశాలపై పట్టు సంపాదించి కార్పొరేట్ రంగంలోకి ప్రవేశించాలని సూచించారు. సంస్థ శిక్షణను సరైన దృక్పథంతో అర్థం చేసుకుని కెరీర్‌లో ఎదగాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, సహాయాచార్యులు డి. కల్యాణి, సీహెచ్ వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, ఎన్. మణికంఠ, సీహెచ్ వేదవతి, అనిత పాల్గొన్నారు.

ఘంటసాల గానం చిరస్మరణీయం



పాత గుంటూరు: కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పాతూరి రంగారావు ఆధ్వర్యంలో అమర గాయకుడు, చిరస్మరణీయుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నాజ్ సెంటర్ ఐలాండ్‌లోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వడ్లమాని రవి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి రామచంద్రరాజు, వ్యాఖ్యాత ఎ.వి.కె.సుజాత, రంగారావు, పగడాల గోపాలరావు, బాలస్వామి, పచ్చిపులుసు సూర్యనారాయణ, డి.చంద్రబాబు , రాజశేఖర్, మొహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

తెలుగు పాటకు ఘంటసాల చిరునామా

తెలుగు పాటకి ఘంటసాల చిరునామా అని, ఆయన మరణించి నాలుగు శతాబ్దాలు దాటినా ఈనాటికీ ఆయన పాటలు నిత్య నూతనంగానే అనిపిస్తాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ ఇంజినీర్ పి.ఘనశ్యామాచార్యులు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఘంటసాల జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు గాయకులు ఘంటసాల పాటల్ని ఆలపించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు పి.మొగిలి పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ప్లేస్‌మెంటు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంటు బ్రోచర్‌ను సోమవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ సైన్స్, ఆర్ట్స్ కళాశాలల్లో 2020-21 నుంచి 2022-23 విద్యా సంవత్సరం వరకు ఆయా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల సమగ్ర సమాచారంతో సెంటర్ ఫర్ హెచ్‌ఆర్డీ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంటు బ్రోచర్‌ను రూపొందించడం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. విద్యార్థులకు ఆయా కంపెనీలు, సంస్థలు త్వరితగతిన ఉపాధి కల్పించేందుకు ఈ ప్లేస్‌మెంటు బ్రోచర్ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, సెంటర్ ఫర్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, అధికారులు ఆచార్య సంధ్యకోలే, ఆచార్య ఉదయ కుమార్, ఆచార్య మల్లికార్జున పాల్గొన్నారు.

శివాలయాల్లో విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక మాస సోమవారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరుడికి అర్చకులు ఉమాపతిశాస్త్రి నమకచమకాలతో అభిషేకాలు నిర్వహించారు. గరుడాచలపాలెంలోని ఉమామహేశ్వరస్వామికి అర్చకులు లక్ష్మీనారాయణ విశేష అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. ఫిరంగిపురంలోని నగరేశ్వరుడికి, కాళహస్తీస్వరస్వామికి అర్చకులు ఆంజనేయశర్మ, రాజేంద్రనాథ్‌శర్మలు క్షీరాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయాల్లో సహస్రదీపాలు వెలిగించారు.

జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: వర్షాకాలం ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యురాలు పి.ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టారు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 75మందికి వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం వర్షాకాలంలో తీసుకోవాల్సినజాగ్రత్తలు గురించి ప్రజలకు వివరించారు. వర్షాలు పడే సమయంలో పిల్లలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమయంలో జలుబు, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వేడితో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు బరువు, ఎత్తు, పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ అన్నామేరి, మేల్ అసిస్టెంట్ బాబావలి, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎస్ఎం ఆనందకుమారి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌తోనే పోటీ ప్రపంచంలో ఉన్నతి



శిక్షణ పొందిన విద్యార్థులతో రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి పరచుకోవడం ద్వారా విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు పేర్కొన్నారు. సంగడిగుంటలోని కళాశాలలో విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఇటువంటి శిక్షణ తరగతుల్ని నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. ప్రముఖ ఇంజినీరు సర్వేశ్వరరావు మాట్లాడుతూ వేలాది రూపాయలు ఖర్చు కాగలిగిన కోర్సును మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ విద్యార్థులకు ఉచితంగా అందించడం గొప్ప విషయమని, శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గత 15 రోజులుగా కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ, ఎంప్లాయిమెంట్ స్కిల్స్‌పై శిక్షణ కల్పించినట్లు వివరించారు. ఎంతో ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా అందించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి



పట్నంబజారు: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని బాలాజీనగర్ రాజీవ్ గృహకల్ప రోడ్డులోని మొండి వాగును సంబంధిత అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో అవసరమైన సహాయక చర్యల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు స్తంభించకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాంబాబు, నగరపాలక సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

చంద్రశేఖర పాహిమాం.. చంద్రశేఖర రక్షమాం

శివాలయాల్లో కార్తిక సోమవారం సందడి



పెదకాకాని శివాలయంలో బారులు తీరిన భక్తులు



పెదకాకాని శివాలయంలో పూజలందుకుంటున్న స్వామి మూలవిరాట్

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం కార్తిక మాస సందడి నెలకొంది. మూడో సోమవారం పూజలు చేసేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే యజ్ఞాల బావి వద్ద పుణ్య స్నానాలు చేసి, భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేశారు. ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి వర్షాలు కురుస్తున్నప్పటికీ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.క్యూ లైన్ల ద్వారా భక్తులకు స్వామి దర్శనం త్వరితగతిన కల్పించారు. ఆలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో భక్తులు పొంగళ్లను పొంగించి స్వామికి నివేదించుకొన్నారు. ఆలయంలో అన్నప్రాశనలు, అభిషేకాలు, వాహన పూజలు, అంత్రాలయ దర్శనాలు జరిగాయి. పోలీసు, అగ్నిమాపక, వైద్య పంచాయతీ శాఖ సిబ్బంది సహాయ, సహకారాలు అందించారు. పెదకాకాని సీఐ బండారు సురేష్ బాబు శాంతిభద్రతల్ని స్వయంగా పర్యవేక్షించి, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మూడో సోమవారం వివిధ సేవా రుసుముల ద్వారా స్వామికి రూ. 6,50,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనరు ఎస్. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

వడ్లమూడి క్వారీ దేవస్థానంలో ప్రత్యేక పూజలు

చేబ్రోలు: వడ్లమూడిలోని క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు శివలింగాకారంలో దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తుపాను ప్రభావం కారణంగా వర్షం పడుతున్నప్పటికి కార్తిక దీపోత్సవానికి పరిసర గ్రామాలకు చెందిన పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో మహిళలు పెద్దసంఖ్యలో కార్తిక దీపాల్ని వెలిగించారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి: ఏడీఏ

పొన్నూరు: తుపాను నేపథ్యంలో వరి కోతలు పూర్తికాని చోట తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని ఏడీఏ వి. రామకోటేశ్వరి రైతులకు సూచించారు. మండలంలోని పెదపాలెంలో సోమవారం వరి పొలాలు, కుప్పలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ తుపాను కారణంగా ఎవరూ నష్టపోకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి ధాన్యపు రాసుల్ని భద్రపరచుకోవాలని సూచించారు. ఎండని వరిని కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై జల్లాలని చెప్పారు.